కథా నిలయం
శ్రీకాకుళం

# ఏ వీధి మేలు

చిన్నతనంలో బహుశా రెండవతరగతి చదువుతన్నప్పుడేమో అనుకుంటా, తెలుగువాచకంలో 'ఏ అరుగు మేలు' అని ఓ పాఠం వున్నట్లు గుర్తు.

నలభై సంవత్సరాల వయసులో హఠాత్తుగా ఆ పాఠం గుర్తురావటానిక్కారణం ఇటీవలే మా వీధిలో ఓ ఖాళీస్థలాన్ని ప్రజానాయకుడు ప్రభాకరం కొన్నట్లు తెలియటం. ఆయన మా వీధిలో స్థలం కొనడం మా అందరికీ గొప్ప సంతోషాన్ని అంతకు మించి గర్వాన్ని కలుగజేసింది.

అనుకున్నట్లుగానే ఆరునెలలు తిరక్కుండా ఆయనగారు ఇల్లుకట్టుబడి కార్యక్రమం ప్రారంభించారు. శంకుస్థాపననాడే అంతరంగికులు, అనుయాయులు, ప్రముఖులు ఎంతోమంది హాజరై శుభాకాంక్షలు తెలియజేశారు.

ఆనాటి సందడి చూశాక, ఇక గృహప్రవేశం రోజున ఎంతటి హంగామాగా, ఆర్భాటంగా జరుగుతుందో కదా అనిపించింది.

నేను, మా ఇంటికి ఎదురింట్లో వుండే హెడ్మాష్టారు, ఆ పక్కింటి ప్రకాశరావు, రెండో వైపు నుండే ఇంజనీరు వెంకటేశ్వరరావు కాస్తంత సాన్నిహిత్యంగా మసలుకుంటుంటాం. ఆ కారణంచేత ప్రభాకరంగారు మా వీధిలో ఇల్లుకట్టడం గురించి మాలోమేమే ఊహాగానాలు చేయసాగాం.

* * * *

ఇంటి పునాదుల పని పూర్తయింది. ఇసుక, కంకర కుప్పలుగా రోడ్డుమీద వుంది. ఓ పక్కగా ఇనుప చువ్వలు పడేసివున్నయ్.

తాత్కాలికంగా పక్కింటిని బాడుగకు తీసుకుని అక్కడ వడ్రంగం పనిచేయిస్తున్నారు. రాత్రి పూట కూడా పనులు సాగుతున్నయ్.

"ఆయన మనకు ప్రత్యక్షంగా ఉపయోగపడటం ఎలా ఉన్నా ముందు మన ఇళ్ళముందు రోడ్డు బాగుపడుతుంది. త్వరలోనే సిమెంటు రోడ్డు ఖాయం" అని నవ్వేడు ప్రకాశరావు.

"రోడ్డు సరేనండీ అదెటూ ఖాయమే. అంతకన్నా ముఖ్యంగా ముందు మన రోడ్డుకి మున్సిపాలిటీ వారి కుళాయిలైను పడుతుంది చూడండి. ముందు మనందరికీ నీళ్ళబాధ తీరిపోతుందని ఆశపడుతున్నాన్నేను" చెప్పేడు వెంకటేశ్వరరావు.

"మన వీధి దీపాలు ఇక దేదీప్యమానంగా వెలిగిపోతాయిలెండి. కుక్కల బెడద, దొంగల భయం వుండదు" హెడ్మాష్టారి ఉవాచ.

"అవునూ ఓ రోజు మనం అంతా కలసి వెళ్లి ఆయనగార్ని పరిచయం చేసుకుని, కొత్త ఇంటిని అంతా చూసివస్తే పోలా... పుణ్యం... పురుషార్థం" సలహాగా అన్నాడు ప్రకాశరావు.

సరే అంటే సరే అనుకున్నాం.

ఓరోజు సాయంకాలం నలుగురం కలసి కొత్త ఇంటిదగ్గరకు వెళ్ళాం. అక్కడ పనులు పర్యవేక్షిస్తున్న పెద్దమనిషి మా దగ్గరకు వచ్చాడు.

మేం ఫలానా అని పరిచయం చేసుకున్నారు హెడ్మాష్టారు. మమ్మల్నీ పరిచయం చేశాడు.

మమ్మల్ని లోపలికి రమ్మని సాదరంగా ఆహ్వానించాడు. పనికుర్రాడిచేత ఓ అరడజను కుర్చీలు తెప్పించి వేయించాడు.

మేమంతా వద్దని వారిస్తున్నా ఫ్లాస్కు ఇచ్చి కాఫీలు తెమ్మని ఆ కుర్రాడికి పురమాయించాడు.

మేం ఎవరెవరం ఏం పనిచేస్తుంటామో, ఎంత కాలంగా ఆ వీధిలో ఉంటున్నామో అడిగి తెలుసుకున్నాడు. అతగాడు ప్రభాకరం బావమరిదిగా చెప్పేడు. అందర్నీ లోపలికి తీసుకువెళ్ళి కట్టుబడి అంతా తిప్పి చూపించాడు.

అంతా భారీ ఎత్తున ఉన్నది. హంగులూ, ఆర్భాటాలు చాలా ఎక్కువగా ఉన్నయ్. పనివాళ్ళు పెట్టే ఇబ్బందుల గురించి ఏకరువు పెట్టాడు కాసేపు. మెటీరియల్ సరఫరా చేసేవారి బాగు గురించి వివరించాడు.

ఇంతలో కాఫీ కప్పుల్లో పోసుకుని అన్నింటిని ట్రేలో పెట్టుకుని వచ్చాడు కుర్రాడు.

కాసేపు అతన్తో అలాఅలా లోకాభిరామాయణం మాట్లాడేము. ఇంటి నిర్మాణపు ఘనతని కాసేపు కొనియాడాము. ప్రభాకరం ఊళ్ళో లేనందుకు మనసులోనే నొచ్చుకుని కాసేపటికి అక్కడినుంచి నిష్క్రమించాము.

* * * *

వారం రోజుల తర్వాతగానీ నాయకుడు నగర ప్రవేశం చేయలేదు. మళ్ళీ మేం కొత్త ఇంటికి వెళ్ళలేదు. పనులన్నీ చకచకా పూర్తయిపోయినై. నాలుగునెలల్లో ఇంటిపనంతా పూర్తయింది.

గృహప్రవేశానికి నాయకులవారే స్వయంగా వచ్చి మా అందర్నీ ఆహ్వానించాడు. వీధి వీధంతా షామియానాలు వేయించాడు. పూలతోరణాల్తోనూ, విద్యుద్దీపాలతోనూ కళకళలాడిపోతున్నది మా వీధి. ప్రస్తుతానికి రోడ్డు గుంటలు పూడ్చి మరమ్మతులు చేశారు.

పెద్దపెద్దవాళ్లంతా విచ్చేశారు. అంతా కోలాహలం. కనీవినీ ఎరుగని రీతిలో వైభవోపేతంగా జరిగిన ఆ గృహప్రవేశ కార్యక్రమాన్ని ఆనందంతో తిలకించి మేమూ ఆ ఇంటికి అతిథులుగా వెళ్ళి విందు ఆరగించాం.

అందరం కలిసి తలా నూరు రూపాయలు చందాగా వేసుకుని పెద్ద వెంకటేశ్వరస్వామి ఫోటో చక్కటి ఫ్రేముతో బిగించినది కానుకగా ఇచ్చాము. ఆ పటం మా దగ్గర తీసుకుంటూ ఓ ఫోటో తీయించుకున్నారాయన. అది మాకు చాలా సంతోషం కలిగించింది.

అంతేకాదు మేమిచ్చిన ఆ పటాన్ని అప్పటికప్పుడు పనివాళ్ళని పిలిపించి వరండాలో గుమ్మం పైగా గోడకు అమర్చచేశారు. అది మాకు మరింత గర్వాన్ని కలుగజేసింది. కృతజ్ఞతలు తెలియచేసి తృప్తిగా ఇళ్ళకు చేరేము.

* * * *

ఓ నెలరోజులు గడిచాక మా వీధికి సిమెంటు రోడ్డు మంజూరైనట్లు తెలిసి అందరం సంతోషించాం. ప్రభాకరం ఇంటికి వెళ్లి మా ఆనందాన్ని, అభినందనల్ని తెలియచేశాం.

రెండునెలల్లో సిమెంటు రోడ్డు తయారయిపోయింది. మా వీధికే కొత్త కళ వచ్చినట్లనిపించింది. ఎప్పుడూ వెలుగుతూ ఆరుతూవుండే వీధి దీపాలు ధగధగ వెలగటమే తప్ప ఆరటంలేదు.

రోజూ ఎవరోకరు పెద్దపెద్దవాళ్ళు కార్లల్లో వచ్చి వెళ్తున్నారు. నాయకులవారి ఇల్లు ఎప్పుడూ సందడిగానే వుంటుంది. మా వీధిలో కార్లు తిరగటం మాకెంతో గొప్పగా వుంది. పైగా ఇప్పుడు మమ్మల్ని ఎవరైనా మా ఇంటి చిరునామా అడిగితే ఫలానా నాయకులవారి ఇల్లున్న వీధి అని చెప్పటంలో ఓ గొప్ప థ్రిల్ పొందుతున్నాము.

పార్టీపరంగా ప్రభాకరానికి పలుకుబడి పెరగసాగింది. అనుయాయులు పెరుగుతున్నారు. వ్యతిరేక పార్టీవారికి నిరసనగా బంద్‌లు గట్రా జరపాలంటే ప్రభాకరం ఇంటినుంచే కదిలేవాళ్ళు. పూల దండలు, బాణాసంచా కాల్పుల్తో అదో సంబరంగా జరిగిపోయేది. ఇలా ఇలా కొత్త కొత్త అనుభవాల్తో గడిచిపోతున్నయ్ రోజులు.

"ప్రకాశరావు ఇల్లు అమ్మేస్తున్నాడట" హెడ్మాష్టారు చెప్పిన మాట బాంబులా పేలింది.

"అదేంటి... ఇంత అర్థాంతరంగా" అన్నాను ముందుగా తేరుకున్న నేను.

"ఏమో... అదే నాకూ అర్థం కావటంలేదు" అన్నారాయన.

"ఏమైనా బేరాలు వచ్చినయ్యా... ఎంత చెప్తున్నాడో" అన్నారు ఇంజనీరుగారు.

"ప్రభాకరంగారే కొంటానంటున్నారట...

మూడు లక్షలు ఇస్తానంటున్నారట " రహస్యంగా చెప్పేరు మాష్టారు.

ఆ వ్యవహారం గురించి మేం రకరకాల ఊహా గానాలు చేసి ఎవరి ఇళ్ళకు వాళ్ళం చేరేం.

ఓ వారం రోజులకు ప్రకాశరావు మా దగ్గరకు వచ్చి విషయం చెప్పేడు. లక్షన్నర కంటె విలువ చేయని తన పాత పెంకుటింటికి రెట్టింపు ధర ఇస్తానన్న కారణంగా ఆ పరిసరాల్ని వదలటానికి ఇష్టంలేకపోయినా, కూతురి పెళ్ళి చేసి మరోచోట మరో చిన్న ఇల్లు కట్టుకోవచ్చున్న ఆశకొద్దీ ఇల్లు అమ్మేందుకు సిద్ధపడినట్లు చెప్పేడు. అతని ఆలోచన సరైనదేనని సమర్థించాం అందరం.

ఆరునెలలు తిరిగేసరికి ప్రకాశరావు ఇల్లు.. ప్రభాకరంగారి ఇంద్రభవనంగా మారిపోయింది. పోల్చుకోవటమే కష్టంగా ఉంది. పెద్దకొడుకు కోసం ఆ ఇల్లు కొన్నారట ప్రభాకరంగారు.

అంత ఖరీదైన భవనాలవల్ల మా వీధికి కొత్త శోభతోపాటు ధరకూడా పెరిగిపోయింది. ఇప్పుడు మా వీధి ఖరీదైనది.

ఓ అర్థరాత్రి అరుపులూ, కేకల్తో వీధి వీధంతా మారుమోగిపోయింది. జనానికి నిద్రమత్తు ఒక్కసారిగా దిగిపోయింది. తలుపులు తెరుచుకుని బయటికి వచ్చారంతా.

జనం గుంపులు గుంపులుగా పరుగెత్తుతున్నారు. అరుపులు, కేకలు, అందరి చేతుల్లో కత్తో, గొడ్డలో, చివరికి కర్రో వుండటం చూసినవాళ్ళ కాళ్లూ చేతులు వణికినై.

కాసేపటికి విషయం తెలిసింది. ప్రభాకరంగారి మీద ఎవరో హత్యాప్రయత్నం చేశారట. వాళ్ళను పట్టుకుని నరికిపారేశారు అనుయాయులు. అంతలోనే పోలీసు జీపు వచ్చింది. ఎవరింటి తలుపులు వాళ్లు మూసేసుకుని లోపలికి నడిచారు. వారంరోజుల్దాకా ఆ ఉద్రిక్తత అలానే వుంది.

అది మొదలు అడపాదడపా మా వీధిలో ఇలాంటి గలాటాలు తరచుగా జరగసాగాయి. ప్రభాకరంగారు ఇంటినుంచి బయటకు బయల్దేరినా, బయటి నుంచి ఇంటికి చేరుతున్నా మందీ, మార్బలంతో ఏదో ప్రహసనంగా మారింది.

చీకటిపడితే ఆడవారు బయటికి రావాలంటే భయపడిపోసాగేరు. ట్యూషన్లకు వెళ్ళిన పిల్లలు ఇంటికి చేరేదాకా తల్లడిల్లిపోతున్నారు తల్లిదండ్రులు. ఏ క్షణాన ఏం జరుగుతుందోనన్న ఉద్విగ్నత అందరిలో.

ప్రభాకరం తన ఇంటిపక్కనున్న లెక్చరర్ గార్ని నయానో, భయానో ఒప్పించి ఆ ఇంటిని కొనేశారు. బావమరిదికోసం. ఇష్టపడి కట్టించుకున్న ఇంటిని అయిష్టంగా అమ్మేసి బిక్కముఖంతో వెళ్లిపోయారు లెక్చరర్‌గారి కుటుంబం.

మరి కొద్దినెలలకే ఆ వీధిలో సగంపైగా ఇళ్ళు ప్రభాకరంగారి ఇలాకాగా మారిపోయినై. రోజు రోజుకూ రౌడీలు, గుండాల్తో వీధిలో గొడవలు ఎక్కువ కాసాగినై.

తాగుబోతుల వీరంగాల్తోనూ, ఉన్మాదుల అరాచకాల్తోనూ విసిగి ప్రాణభయం కొద్దీ మిగిలిన వాళ్ళందరం కూడా ఇళ్ళు అమ్ముకుని వెళ్ళాం. తలా ఓ చోట ఓ గూడు ఏర్పాటు చేసుకున్నాం.

అప్పటి మా వీధికి ప్రభాకరంగారి స్ట్రీట్ అని పేరు పెట్టారు. అన్నీ అంతస్థుల భవనాలే. అటుగా వెళ్ళినప్పుడల్లా ఏదోలా వుంటుంది.

ప్రస్తుతం రోజూ దేవుడ్ని ఒక్కటే కోరుకుంటున్నాను - ఏ గూండా గారికీ మా వీధిలో ఇల్లు కట్టుకోవాలనే కోరిక కలుగనీయవద్దని.

ఆరుబయట వేపచెట్టు క్రింద చల్లగాలికి మంచం వేసుకున్న నాకు ఓ వేసవికాలపు సాయంత్రం అన్పించింది. ఏ వీధిమేలు అంటే... ఇప్పటికి మా వీధే అని.

◆ స్వాతి - మాసపత్రిక ◆